సాక్షి
రాజన్న సిరిసిల్ల
బుధవారం । 3 । మే । 2023



రాజన్న సేవలో జడ్జి హేమలత

వేములవాడ: వేములవాడ జూనియర్ సివిల్ జడ్జి ఎం.హేమలత రాజన్నను దర్శించుకున్నారు. అధికారులు ఆమెకు ప్రత్యేక దర్శనం కల్పించారు. ప్రసాదాలు అందించారు.



వేములవాడకు చేరుకున్న మంత్రి

వేములవాడ: దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వేములవాడ చేరుకున్నారు. బుధవారం నాగారంలో జరిగే శ్రీ కోదండ రాముని కల్యాణ వేడుకల్లో పాల్గొంటారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/23.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉండి, ఉరుములు, మెరుపుల తో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మంత్రి కాన్వాయ్ అడ్డగింత



పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మంగళవారం తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు మంత్రి కేటీఆర్ కాన్వాయ్‌ని అడ్డుకున్నారు. నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్‌లో నిర్బంధించారు. ఎవరూ ఊహించని విధంగా ఎల్లారెడ్డిపేటలో మంత్రికి నిరసన సెగ తగిలింది. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే.గౌస్ మాట్లాడుతూ గొల్లపల్లి, ఎల్లారెడ్డిపేట, బొప్పాపూర్ గ్రామాల్లో తడిసిన ధాన్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వడ్ల కొనుగోలు కేంద్రాలను పరిశీలించకుండా, రైతులను పరామర్శించకుండా మంత్రి ప్రైవేట్ కార్యక్రమాలకు హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టయిన నాయకులను స్టేషన్‌లో కేకే మహేందర్‌రెడ్డి పరామర్శించారు.

తాగునీటి కోసం మహిళల ఆందోళన



ఆందోళన చేస్తున్న మహిళలు

ముస్తాబాద్: 'పదిహేను రోజులసంది నీల్లు వత్త లేవు. పంచాయతీ సార్లకు చెప్పినా పట్టించుకుంటలేరు. పొలాల దగ్గర నుంచి నీల్లు తెచ్చుకుంటున్నం. ఎన్ని రోజులీ బాధలు మాకు' అంటూ ముస్తాబాద్ పంచాయతీ కార్యాలయం ఎదుట 12వ వార్డు మహిళలు మంగళవారం ఆందోళనకు దిగారు. పంచాయతీ కార్యదర్శి రాజుతో తమగోడు వెళ్లబోసుకున్నారు. తమ ఇండ్లకు నల్లాకనెక్షన్లు లేవన్నారు. 30ఇళ్లకు కలిపి ఒక బోరుమోటారు ఉందని, అది రిపేరు అయిందన్నారు. పొలాల వద్దకు వెళ్తే రైతులు మోటార్లు బంజేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇండ్లల్లో శుభకార్యాలు ఉన్నాయని, వెంటనే బోర్లు మరమ్మతు చేయించాలని కోరారు. స్పందించిన కార్యదర్శి రాజు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లండని సూచించారు. సర్పంచ్ రిపేరు చేయిస్తామని అన్నారు. నల్ల సుకన్య, దుర్గవ్వ, వెంకట్, గౌండయ్య, గుండెల్లి నర్సవ్వ, అమృత, రాజేశ్వరి, ఎల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయాధికారి సస్పెన్షన్

సిరిసిల్లటౌన్: జిల్లా వ్యవసాయాధికారి రణధీర్‌రెడ్డి సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లాలో వడగండ్ల వానలతో ఏర్పడిన పంటనష్టం వివరాలు అందించడంలో నిర్లక్ష్యం చేయడంపై ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ మేరకు కలెక్టర్ జిల్లా వ్యవసాయాధికారి రణధీర్‌రెడ్డిని సస్పెండ్ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయడంతో ఆయన సస్పెన్షన్‌కు గురయ్యారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లఅర్బన్: తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో కరీంనగర్, జగిత్యాలలోని షెడ్యూల్ కులాల స్టడీ సర్కిల్‌లో 5నెలల ఫౌండేషన్ కోర్సుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలతో పాటు బ్యాంకింగ్, ఆర్‌ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, తదితర పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణతో పాటు భోజన వసతి కల్పించబడునని తెలిపారు. అర్హులైన ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనార్టీ అభ్యర్థులు ఈ నెల 14లోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఈ నెల 21న ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9885218053, 99592 64770 నంబర్లను సంప్రదించాలని అన్నారు.

రైతులు ధైర్యంగా ఉండండి

- వడగండ్ల బాధితులను ఆదుకుంటాం
- ఎకరానికి రూ.10వేలు ఇస్తాం
- జిల్లాలో 19వేల ఎకరాల్లో పంటనష్టం
- 17వేల మంది రైతులు నష్టపోయారు
- ప్రాథమిక అంచనాలు వెల్లడి
- జిల్లా పర్యటనలో మంత్రి కె.తారక రామారావు



ముస్తాబాద్‌లో మహిళా రైతుతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సిరిసిల్ల/సిరిసిల్లక్రైం/ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి/ముస్తాబాద్/గంభీరావుపేట(సిరిసిల్ల):జిల్లాకు గోదావరి జలాలు చేరడంతో రైతులు వరిపంటను యాసంగిలో ఎక్కువగా సాగుచేశారని, పంట చేతికందే దశలో ఇలా వడగండ్లతో నష్టం జరగడం బాధాకరమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో పంట నష్టాలను క్షేత్రస్థాయిలో మంగళవారం పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అకాల వర్షాలు వేసవిలో పడుతున్నాయని, కోతదశలో ఉన్న పంట రాళ్లవానతో నేలపాలైందని అన్నారు. రైతులకు భరోసా ఇచ్చేందుకు, వారిలో ధైర్యాన్ని నింపేందుకు తాను క్షేత్రస్థాయిలో పర్యటించానన్నారు. చాలా చోట్ల రోడ్లపై ధాన్యం పోశారని, ఆ వడ్లు వరదకు కొట్టుపోవడం చాలా బాధగా ఉందన్నారు. అయినా రైతులు ధైర్యం చెడకుండా ఉండాలన్నారు. ఇది రైతు ప్రభుత్వమని సీఎం కేసీఆర్ స్వయంగా రైతు అని కేటీఆర్ వివరించారు. వడగండ్ల వానలతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేల చొప్పున సాయం అందిస్తామన్నారు. జిల్లాలోని 19వేల ఎకరాల్లో, 17వేల మంది రైతులకు పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక సమాచారమని, ఇది ఇంకా పెరిగే అవకాశం ఉందని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్‌తో మాట్లాడానని, ఇప్పటికే రాష్ట్రంలో 7.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారని కేటీఆర్ వివరించారు. క్షేత్రస్థాయిలో ఏ సమస్యలున్నా ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉంటారని, అధికారులు ఆ సమస్యలను పరిష్కరిస్తారని అన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు, టిస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్, డీఆర్వో శ్రీనివాస్‌రావు, 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

- వడగండ్లవానలతో నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడవద్దని మంత్రి కేటీఆర్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం గుంటపల్లిచెరువుతండాలో వడగండ్లకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.
- మండలంలో 133ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ,రైతుబంధు అధికారులు అంచనా వేశారన్నారు. రైతులకు పంటనష్ట పరిహారం అధికారులే ఇళ్లవద్దకు వచ్చి అందిస్తారని భరోసా ఇచ్చారు.
- సీఎం కేసీఆర్ సెక్రటేరియట్ ప్రారంభం సందర్భంగా పోడు భూములను క్రమబద్ధీకరించే ఫైల్‌పైనే తొలి సంతకం చేశారని మంత్రి కేటీఆర్ గుర్తు చేశారు. ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, తహసీల్దార్ జయంత్‌కుమార్, తదితరులు ఉన్నారు.



గంభీరావుపేట: జ్ఞాపిక అందిస్తున్న జెడ్పీటీసీ

- వీర్నపల్లి మండలకేంద్రంలో గంగధరి కుమార్, చొప్పరి రాజుకు చెందిన పంటను పరిశీలించారు. మంత్రివారితో మాట్లాడుతున్నక్రమంలో ఆ రైతుల కుటుంబసభ్యులు కన్నీరు పెట్టుకున్నారు. 'కంటతడి పెట్టకండి అమ్మా.. నేను చేతిలో చెయ్యేసి చెప్తున్న అండగా మేమున్నాం'. అంటూ భరోసా ఇచ్చారు.
- ముస్తాబాద్, నామాపూర్, గోపాల్‌పల్లెలో పర్యటించిన మంత్రి కేటీఆర్ ఏడాది యాసంగిలో ఎకరాకు 31క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చిందని, ఆకాలవర్షాలతో తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేస్తారని రైతులకు హామీ ఇచ్చారు.
- ప్రజాప్రతినిధులు నష్టపోయిన రైతుల వివరాలను సర్వే చేయించాలని ఆదేశించారు. రైతులు ఓపికతో ఉండి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అప్పగించాలన్నారు. ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ సర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, సర్పంచ్‌లు విజయ, జ్యోతి, నరేశ్, అంజయ్య, తదితరులు ఉన్నారు.
- గంభీరావుపేట మండలం గోరింటాల గ్రామంలో జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ–లక్ష్మణ్ దంపతుల నూతన గృహప్రవేశానికి కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ దంపతులు కేటీఆర్‌కు జ్ఞాపికను అందించారు.
- నర్మాల గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెద్దమ్మ కల్యాణోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ రాజేందర్ నూతన గృహప్రవేశానికి హాజరయ్యారు. సముద్రలింగాపూర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్‌ఎస్ నేత కామిడి సదాశివరెడ్డిని పరామర్శించారు.
- కొత్తపల్లిలో వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ఆలయకమిటీ సభ్యులు, ఎంపీపీ వంగ కరుణ కేటీఆర్‌కు ఆహ్వానపత్రిక అందించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, సర్పంచ్ అంజమ్మ, ఎంపీటీసీ అంజిరెడ్డి, ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పర్శ హన్మండ్లు పాల్గొన్నారు.

ఏడాదిలో మూడుసార్లు క్రీడాపోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న మంత్రి కేటీఆర్, ఎస్పీ అఖిల్ మహాజన్, తదితరులు

శాంతిభద్రతల పరిరక్షణలో బిజీగా ఉండే పోలీసులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుందని మంత్రి కేటీఆర్ అన్నారు. సిరిసిల్లలో జరిగిన పోలీసు స్పోర్ట్స్‌మీట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ క్రీడల్లో గెలుపొందినవారికి బహుమతులు అందించారు. పోలీసులకు ఏడాదికి మూడుసార్లు క్రీడాపోటీలు ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా సాధ్యం కాకున్నా సిరిసిల్లలో అమలు చేసేలా కృషి చేస్తామని అన్నారు.పోటీల నిర్వహణకు ప్రణాళిక చేసిన ఎస్పీ అఖిల్ మహాజన్‌తోపాటు, పనిచేసిన వారందరినీ అభినందించారు.

పండించిన ప్రతి గింజ కొంటాం

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- సాదాసీదాగా జెడ్పీ సర్వసభ్య సమావేశం
- ఎజెండా అంశాలు ప్రస్తావించకుండానే
- మంత్రి కేటీఆర్ రాకతో ముగిసిన మీటింగ్





మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, హాజరైన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జిల్లా అధికారులు

సిరిసిల్ల: జిల్లాలో రైతులు పండించిన ప్రతిగింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం జెడ్పీ సర్వసభ్య సమావేశం జరిగింది. అరుణ మాట్లాడుతూ వడగండ్ల వానలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని, ఎకరానికి రూ.10వేలు చెల్లిస్తుందన్నారు. జిల్లాలో ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లను స్థాపించాలని కోరారు. మిషన్ భగీరథలో సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. కాగా.. జెడ్పీ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అధ్యక్షతన మధ్యాహ్నం 2.30 గంటలకు కలెక్టరేట్‌లో మొదలైన సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జిల్లా అధికారులు ఆలస్యంగా వచ్చారు. మంత్రి కేటీఆర్ జిల్లా పర్యటన నేపథ్యంలో సమావేశం ఒక దశలో కోరం లేక వాయిదా పడుతుందని భావించారు. జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ రావడంతో ఆమె వెంట మెజార్టీ జెడ్పీటీసీ సభ్యులు వచ్చారు. జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి సర్వసభ్య సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో 36 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అంశాలు ఉండగా. కేవలం కొన్ని అంశాలను మాత్రమే సభలో ప్రస్తావించారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చ లేకుండానే సమావేశం ముగిసింది. మంత్రి కేటీఆర్ కలెక్టరేట్‌కు రావడంతో సభను అర్ధాంతరంగా ముగించారు. జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, జెడ్పీటీసీలు, ఎంపీపీల, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్, డీసీవో బుద్ధనాయుడు, డీపీవో రవీందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో కూలీల సంఖ్య పెంచాలి



ఉపాధిహామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలి. గతేడాది తీసుకున్న పనుల్లో మెటీరియల్ కాంపోనెంట్ పూర్తి అయింది. లేబర్ కాంపోనెంట్ పెంచితేనే ఇతర పనులకు మెటీరియల్ కాంపోనెంట్ మంజూరు అవుతుంది. భర్త చనిపోతే భార్యకు ఆసరా పెన్షన్ ఇవ్వొచ్చు.

– బి.గౌతమ్‌రెడ్డి, జెడ్పీ సీఈవో

రోడ్డు వేయండి



పీఎంజీఎస్‌వై మంజూరైన మా మండల పరిధిలోని నాగయ్యపల్లె రోడ్డు పనులను ఎందుకు చేయడం లేదని పంచాయతీరాజ్ అధికారులు సమాధానం ఇవ్వాలి. నక్షా ప్రకారం రోడ్డు వేయాలని తహసీల్దార్ చెప్పినా.. అధికారులు పనులు చేయడం లేదు. కొత్తగా అర్హులైన వారికి ఆసరా పెన్షన్లు అందక ఇబ్బందులు పడుతున్నారు.

– బండ మల్లేశం యాదవ్, ఎంపీపీ వేములవాడ రూరల్

పనిముట్లు ఇవ్వడం లేదు



ప్రస్తుతం కొనసాగుతున్న ఉపాధిహామీ పనుల్లో కూలీలకు పనిముట్లు ఇవ్వడం లేదు. ఐదు కిలోమీటర్లు వెళ్లి పని చేసినా.. ప్రయాణ భత్యం ఇవ్వడం లేదు. కూలీలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఆసరా కొత్త పెన్షన్ల మంజూరుకు ఆన్‌లైన్ ఎప్పుడు ఓపెన్ అవుతుందో అధికారులు సమాధానం చెప్పాలి.చాలా మంది అర్హులు నిరీక్షిస్తున్నారు.

– గంగం స్వరూపారాణి, ఎంపీపీ, రుద్రంగి

భగీరథ నీరు రావడం లేదు



వీర్నపల్లి మండలంలోని మద్దిమల్ల గిరిజన తండాలకు మిషన్ భగీరథ నీరు రావడం లేదు. సరైన ఏర్పాటు లేకపోవడంతో మంచినీరు అందక వేసవిలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి. ఇప్పుడైనా స్పందించి నీటి సమస్యను తీర్చండి.

– మాలోత్ భూలా, ఎంపీపీ, వీర్నపల్లి

బద్దిపోచమ్మకు బోనం



బోనాలతో బారులు తీరిన భక్తులు



బోనంతో భక్తుల విన్యాసాలు

వేములవాడ: వేములవాడ బద్దిపోచమ్మ ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. సోమవారం వేములవాడ రాజన్నను దర్శించుకున్న భక్తులు మరునాడు బద్దిపోచమ్మకు బోనాలు సమర్పించారు. ఆలయ ఆవరణలో వేసిన చలువపందిళ్లలో నెత్తిన బోనాలతో బారులుతీరి అమ్మవారిని దర్శించుకున్నారు. నైవేద్యం, కల్లుసాక సమర్పించారు. ఈ సందర్భంగా దారిపొడవునా భక్తులు, శివసత్తులు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

'ఆరోగ్య మహిళ'కు స్పందన



సిరిసిల్ల సుందరయ్యనగర్ ఆస్పత్రిలో ఆరోగ్య మహిళ కార్యక్రమం

సిరిసిల్లటౌన్: జిల్లా వైద్యారోగ్యశాఖ చేపట్టిన 'ఆరోగ్య మహిళ' శిబిరానికి మంచి స్పందన వచ్చింది. మంగళవారం డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ మోహన్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. సిరిసిల్లలోని పీఎస్‌నగర్, వేములవాడ పీహెసీ, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా వివిధ హెల్త్‌సెంటర్లలో నిర్వహించిన ఆరోగ్య మహిళ శిబిరాల్లో ఓపీడీ(408), బ్రెస్ట్(408), ఆర్‌సీఎగ్జామినేషన్(408) పరీక్షలు జరిపినట్లు పేర్కొన్నారు. ఇవి కాకుండా యూటీఐ(4), ల్యాబ్(109), థైరాయిడ్(63), విట మిన్ డీ(35), సీబీపీ(84), సూక్ష్మ పోషకాలు(84) మందికి పరీక్షలు నిర్వహించి వీరిలో 09 మందిని జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు వివరించారు.



కోనరావుపేట: మొలకెత్తిన ధాన్యంతో మహిళలు



సిరిసిల్ల పరిధిలోని పెద్దూరు బైపాస్‌లో ధాన్యం ఆరబోస్తున్న అన్నదాతలు



సిరిసిల్ల పరిధిలోని బోనాల బైపాస్ వెంట ఆరబోసిన ధాన్యం



చిన్నబోనాలలో మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతు గొస్కుల మల్లయ్య



ఇల్లంతకుంట పరిధిలో మొలకెత్తిన ధాన్యం

ధాన్యం.. దైన్యం

- జిల్లాలో పంటల కోసం అన్నదాతల కష్టాలివీ

పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు. దిగుబడిపై ఆశలేదు. మిగిలిన ధాన్యాన్నైనా దక్కించుకుందామన్న తాపత్రయం రైతులది. ఇప్పటికే కష్టం నీటిపాలైంది. ఆరుగాలం శ్రమించి వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తే మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా మారింది. జిల్లావ్యాప్తంగా కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోయింది. చాలా ప్రాంతాల్లో కల్లాల్లోనే వడ్లు మొలకెత్తాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇల్లంతకుంట, కోనరావుపేట మండలాల్లో మొలకెత్తిన ధాన్యాన్ని రైతులు ఆరబెట్టడం కనిపించింది. సిరిసిల్ల జిల్లాకేంద్రం పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం వర్షం లేకపోవడంతో రైతులు తమ ధాన్యాన్ని ఇలా రోడ్లపై ఆరబోయడం కనిపించింది. మొలకెత్తిన ధాన్యాన్ని కొనాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

– ఇల్లంతకుంట(మానకొండూర్)/కోనరావుపేట(వేములవాడ)/ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల



కోనరావుపేటలో మొలకెత్తిన ధాన్యం

క్లుప్తంగా

గుడుంబా విక్రేతల బైండోవర్



తహసీల్దార్ ఎదట బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

రుద్రంగి(వేములవాడ): గుడుంబా తయారీ చేస్తూ విక్రయిస్తున్న రుద్రంగి మండల కేంద్రంలోని గువ్వల బండ తండాకు చెందిన గుగులోతు రేనా, మానాల హనుమాన్ తండాకు చెందిన దెగావత్ అమృతలను ఎక్సైజ్ పోలీసులు మంగళవారం తహసీల్దార్ భాస్కర్ ఎదట బైండోవర్ చేశారు. గుడుంబా తయారు చేసినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్సైజ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

జిల్లా కవులకు సాహిత్య పురస్కారాలు



అవార్డులు అందుకున్న లక్ష్మణ్, దేవానందం

సిరిసిల్లకల్చరల్: జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరు కవులు ఆడెపు లక్ష్మణ్, బూర దేవానందంలను సాహిత్య పురస్కారాలు వరించాయి. స్వర్గీయ డాక్టర్ కొండబత్తిని రవీందర్ స్మారకార్థం ఏటా ఇచ్చే అవార్డులకు వీరు ఎంపికయ్యారు. మంగళవారం జిల్లా కేంద్రంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, ప్రముఖ సాహితీవేత్త జూకంటి జగన్నాథంలు పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాజిక స్పృహతో కవిత్వాన్ని వెలువరించిన రవీందర్ స్మారకార్థం అవార్డులు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కవులు వెంగల లక్ష్మణ్, వెంకటేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవో ప్రధాన కార్యదర్శికి రాజన్న ప్రసాదం



జగదీశ్వర్‌ను సత్కరిస్తున్న చంద్రశేఖర్

వేములవాడ: టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మారం జగదీశ్వర్‌ను వేములవాడ రాజన్న ఆలయ పీఆర్వో చంద్రశేఖర్ మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించి, స్వామివారి ప్రసాదం అందించారు.

రాజన్న కోడెల అప్పగింత



కోడెలను అప్పగిస్తున్న అధికారులు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ రాజన్న గోశాలకు చెందిన 20 కోడెలను మంగళవారం వేములవాడ పట్టణంలోని ముదిరాజ్ వీధికి అప్పగించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాస్, నరసింహమూర్తి, శ్యాం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి' డ్యాన్స్ శిబిరానికి స్పందన

- సిరిసిల్లలో 50 మందికి మూడు రోజుల ఉచిత శిక్షణ
- ఉత్సాహంగా నేర్చుకుంటున్న చిన్నారులు



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరంలో రెండోరోజు డ్యాన్స్ నేర్చుకుంటున్న చిన్నారులు

సిరిసిల్లటౌన్/సిరిసిల్లఅర్బన్: నిన్నటివరకు పుస్తకాలతో కుస్తీ పడిన చిన్నారులు.. ఇప్పుడు ఆనందంతో స్టెప్పులు వేస్తున్నారు. ఏడాదిపాటు చదువులు సాగించిన విద్యార్థులకు వేసవి సెలవులు వచ్చాయి. వాటిని సద్వినియోగం చేసుకోవడానికి ‘సాక్షి’ మీడియా వారికి అవకాశం కల్పించింది. తనవంతు బాధ్యతగా సిరిసిల్లలో మూడు రోజులపాటు ఉచిత డ్యాన్స్ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా 50 మంది పిల్లలు స్థానిక ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో డ్యాన్స్ నేర్చుకుంటున్నారు. ఈ సందర్భంగా పలువురు తమ అభిప్రాయాలు వెల్లడించారు.

డ్యాన్స్ అంటే ఇష్టం..



నాకు డ్యాన్స్ అంటే ఇష్టం. మా డాడీ రవి మంచి డ్యాన్సర్. అందుకే ఎక్కడ కాంపిటీషన్స్ జరుగుతున్నా నేను పాల్గొంటున్న. ఇక్కడి శిబిరంలో మాస్టర్ నుంచి కొన్ని మెళకువలు నేర్చుకున్న. – పండుగ వెన్నెల, ఏడోతరగతి

ఎంజాయ్ చేస్తున్న..



వేసవి సెలవుల్లో డ్యాన్స్ నేర్చుకోవడం సంతోషంగా ఉంది. నేను చిన్నప్పటి నుంచి డ్యాన్స్ అంటే ఎంజాయ్ చేస్తాను. మా కోసం ప్రత్యేకంగా శిబిరం నిర్వహించడం బాగుంది. –గొడుగు దీక్షిత, పదోతరగతి

పోటీల్లో పాల్గొంటా..



నేను ఒకటో తరగతి నుంచి భరతనాట్యం నేర్చుకుంటున్న. ఇక్కడి శిబిరంలో మాస్టర్ వెస్టర్న్ డ్యాన్స్ స్టెప్పులు నేర్పిస్తున్నారు. డ్యాన్స్ పోటీల్లో పాల్గొంటా. – ఎస్కే.మాహిమ్, ఏడోతరగతి

'సాక్షి'కి కృతజ్ఞతలు..



శిబిరంలో పిల్లల ఆసక్తిని బట్టి వారికి ఇష్టమైన డ్యాన్స్ నేర్పిస్తున్నాం. ప్రభుత్వం సహకరిస్తే ఉచిత శిబిరాలు నిర్వహిస్తాం. సాక్షి యాజమాన్యానికి కృతజ్ఞతలు. – పొందుర్తి ధర్మేందర్, డ్యాన్స్ మాస్టర్

శిబిరం అభినందనీయం..



పిల్లలను చదువుతోపాటు అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలి. వేసవి సెలవుల్లో ఉచిత డ్యాన్స్ శిబిరం నిర్వహించడం అభినందనీయం. 'సాక్షి' సామాజిక బాధ్యతకు కృతజ్ఞతలు. – రాజ్‌కుమార్, ఇంగ్లిష్ యూనియన్ స్కూల్ కరెస్పాండెంట్

బేసిక్స్ చెబుతున్నారు..



నేను డ్యాన్స్ క్లాసుకు వస్తున్న. మాస్టర్ నాకు బేసిక్స్ చెబుతున్నారు. ఇంటికి వెళ్లాక ప్రాక్టీస్ చేస్తా. పోయిన సెలవుల్లో కూడా డ్యాన్స్ నేర్చుకున్న. – చొప్పదండి శ్రిత, యూకేజీ

అమ్మ నేర్చుకోమంది..



సెలవుల్లో డాన్స్ నేర్చుకోమని అమ్మ చెప్పింది. ఇక్కడ ఫ్రెండ్స్‌తో కలిసి నేర్చుకుంటున్న. మా స్కూల్‌లో ప్రోగ్రాం జరిగితే డ్యాన్స్ చేస్తా. – సుచిత్‌రావు, యూకేజీ

నేడు ముగింపు.. హాజరుకానున్న అతిథులు

'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డ్యాన్స్ శిక్షణ శిబిరం బుధవారంతో ముగియనుంది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య, స్థానిక కౌన్సిలర్ జాగీరు శైలు, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్ గౌడ్ తదితరులు హాజరవుతారు.

గంభీరావుపేట కళాశాలకు 'న్యాక్ బి-ప్లస్' గుర్తింపు

- తొలి ప్రయత్నంలోనే ఫలితం
- హర్షం వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ బి-ప్లస్ గుర్తింపు లభించింది. తొలి ప్రయత్నంలోనే ఫలితం దక్కడంతో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ గుర్తింపు ఐదేళ్ల వరకు ఉంటుంది. తర్వాత మరోమారు ఉన్నత స్థానం కోసం ప్రయత్నం చేయవచ్చు. న్యాక్ గుర్తింపు కోసం కళాశాల అధికారులు గతంలో నివేదికలు సమర్పించారు. ఈ నేపథ్యంలో గత ఏప్రిల్ 20, 21 తేదీల్లో ముగ్గురు సభ్యులున్న న్యాక్ అధికారుల బృందం కళాశాలను సందర్శించింది. అన్ని విభాగాలను పరిశీలించారు. కళాశాల విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. కళాశాలలోని సౌకర్యాలను ప్రత్యక్షంగా చూశారు. న్యాక్ బి-ప్లస్ గుర్తింపుతో కళాశాల అభివృద్ధికి మరిన్ని నిధులు వచ్చే అవకాశం ఉంది.

840 మంది విద్యార్థులు..

ప్రస్తుతం కళాశాలలో 840 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. సైన్స్, ఆర్ట్స్ సబ్జెక్టులతోపాటు పీజీ కోర్సులు నిర్వహిస్తున్నారు. స్వయం ఉపాధి శిక్షణ, వివిధ రకాల క్లబ్బులు, ఎన్ఎస్ఎస్, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ, జిజ్ఞాస ప్రాజెక్టుల రూపకల్పనకు ప్రత్యేక విభాగాలు పని చేస్తున్నాయి. వీటి పనితీరుకు న్యాక్ అధికారులు సంతృప్తి చెందారు.

సంతోషంగా ఉంది



గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు తొలి ప్రయత్నంలోనే న్యాక్ బి-ప్లస్ గుర్తింపు రావడం సంతోషంగా ఉంది. అందరి సహకారంతోనే ఇది సాధ్యమైంది. కళాశాల అభివృద్ధికి మరిన్ని నిధులు వచ్చే అవకాశం ఉంది. గుర్తింపు వచ్చేందుకు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు.
– ప్రొఫెసర్ వి.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల

బార్, బెంచ్ సహకారంతోనే న్యాయసేవలు

- సబ్ జడ్జి నట్టు రవీందర్
- జూనియర్ సివిల్ జడ్జి ప్రతీక్ సిహాగ్‌కు ఆత్మీయ వీడ్కోలు



జడ్జి ప్రతీక్ సిహాగ్‌ను సత్కరిస్తున్న సబ్ జడ్జి రవీందర్, న్యాయవాదులు

వేములవాడ: బార్, బెంచ్ సంపూర్ణ సహకారంతోనే నిరాటంకంగా న్యాయసేవలు అందుతాయని సబ్ జడ్జి నట్టు రవీందర్ అన్నారు. జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహించి, కూకట్‌పల్లి కోర్టుకు బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తి ప్రతీక్ సిహాగ్‌కు మంగళవారం ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. జడ్జి పోస్టు ఒత్తిడితో కూడుకున్నదని, ఉద్యోగులకు బదిలీ అనివార్యమన్నారు. జూనియర్ సివిల్ జడ్జి ప్రతీక్ సిహాగ్ మాట్లాడుతూ.. తనకు సహకరించిన న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంట రాజు మాట్లాడుతూ.. వేములవాడ కోర్టులోని అడ్వకేట్లకు జడ్జి ప్రతీక్ సిహాగ్ అందించిన సహకారం ఎల్లప్పుడే గుర్తుంటుందని తెలిపారు. జూనియర్ న్యాయవాదులకు ఎంతగానో ప్రోత్సహించారని అన్నారు. ప్రధాన కార్యదర్శి నక్క దివాకర్ మాట్లాడుతూ.. జడ్జి ఎంతటి సమస్యనైనా కూల్‌గా డీల్ చేస్తూ న్యాయవాదులకు శిక్షణ ఇచ్చారన్నారు. సీనియర్ న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, నేరెళ్ల తిరుమల్‌గౌడ్, చెర్ల ఆనంద్‌కుమార్, పాత్తూరి అనిల్, పిట్టల భూమేశ్, పిట్టల మనోహర్, గుండా రవి, పురుషోత్తం, రేగుల దేవేందర్, సంటి సుజీవన్, విద్యాసాగర్‌రావు, కిషోర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పీఈటీలకు పదోన్నతి ఇవ్వాలి

- మంత్రి కేటీఆర్‌కు పీఈటీల అసోసియేషన్ ప్రతినిధుల వినతి



మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

సిరిసిల్లటౌన్: పీఈటీలకు పదోన్నతి ఇవ్వాలని పీఈటీల అసోసియేసన్ జిల్లా ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం సిరిసిల్లకు వచ్చిన మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఏళ్లుగా పీఈటీలుగా పని చేస్తున్న తమకు పదోన్నతులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో చొరవ చూపి, పీడీలుగా పదోన్నతి ఇప్పించాలని విన్నవించారు. జిల్లా అధ్యక్షుడు దుప్పటి విజయ్‌కుమార్, కార్యదర్శి కుంట శ్రీనివాస్, కోశాధికారి తడుకల శ్యాంకుమార్, శ్రీనివాస్, రాజు, రాజశేఖర్, రమేశ్, అజయ్‌కుమార్, పర్శరాములు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.50 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. మంగళవారం తంగళ్లపల్లి మండలంలోని బస్వాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఐకేపీ, సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లో తూకం ఆలస్యంగా ప్రారంభించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. రైస్ మిల్లర్లకు తక్కువ ధరకే ధాన్యం అమ్ముకొని, శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,060 ఉండగా మిల్లర్లు రూ.1,600 మాత్రమే చెల్లిస్తున్నారని, ఒక లారీ ధాన్యం కొనుగోలు చేస్తే సుమారు 20 క్వింటాళ్ల తరుగు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, రైస్ మిల్లుల యజమానులు సిండికేట్‌గా ఏర్పడి, అన్నదాతను నిలువు దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. దీనిపై కలెక్టర్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తడిసిన ధాన్యాన్ని భేషరతుగా ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ తంగళ్లపల్లి మండల కార్యదర్శి మంచికట్ల రమేశ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు సోమ నాగరాజు, నాయకులు మల్లయ్య, చంద్రం, ఆనంద్, బాలయ్య, రాజలింగం, మణెవ్వ, పోచవ్వ తదితరులు పాల్గొన్నారు.

'కూర రాజన్నకు ఆశ్రయం కల్పించినవారిపై నిఘా సరికాదు'

సిరిసిల్లక్రైం: జనశక్తి నేత కూర రాజన్న కోర్టు కేసుల నిమిత్తం ఆశ్రయం పొందుతుండగా పోలీసులు, ప్రభుత్వం ప్రాథమిక హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నారని ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో విమలక్క, అనసూయ, అల్లూరి విజయ్ నాగిరెడ్డి పేరిట మంగళవారం ప్రకటన విడుదల చేశారు. నిఘా పేరిట పోలీసులు కూర రాజన్నను కలుస్తున్న వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. జిల్లాను వీడొద్దన్న హైకోర్టు షరతుల నేపథ్యంలో ఆయనకు వేములవాడలో ప్రేమతో ఆశ్రయం కల్పిస్తున్న వారిపైనా పోలీస్ నిఘా కొనసాగించడం సరికాదన్నారు. చట్టప్రకారం కోర్టు విచారణ ఎదుర్కొంటూ ప్రజల మధ్య జీవిస్తున్నవారిని పోలీసులు వేధించడాన్ని ప్రజాస్వామ్యవాదులు, మేధావులు ఖండించాలని కోరారు.

కొనుగోళ్లలో ఆలస్యంపై అన్నదాతల ఆగ్రహం

- ముస్తాబాద్–సిరిసిల్ల రహదారిపై రైతుల రాస్తారోకో



ముస్తాబాద్(సిరిసిల్ల): ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షాలు, మొలకెత్తిన ధాన్యం, అధికారుల నిబంధనలతో విసిగిపోయిన రైతులు రోడ్డెక్కారు. ముస్తాబాద్ మండలం ఆవునూర్‌లో రైతులు షరతులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రాస్తారోకో చేపట్టారు. ముస్తాబాద్–సిరిసిల్ల ప్రధాన రహదారిపై బైఠాయించిన రైతులు, రెండు గంటలపాటు ఆందోళన చేపట్టడంతో ఇరువైపుల ట్రాఫిక్ స్తంభించిపోయింది. మరోవైపు ముస్తాబాద్ మండలంలో మంత్రి కేటీఆర్ పర్యటన ఉండడంతో పోలీస్ అధికారులు టెన్షన్ పడ్డారు. ఈ సందర్భంగా ఆవునూర్ రైతులు మాట్లాడుతూ ప్యాక్స్ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని మిల్లర్లు బస్తాకు 42.50 కిలోల చొప్పున తీసుకుంటామన్నారని, మాయిశ్చర్ వచ్చినప్పుడు తూకం చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు పడి ధాన్యం మొలకలు వచ్చాక, ఇప్పుడు మాయిశ్చర్ పేరుతో నాలుగు రోజులుగా ధాన్యం కొనుగోళ్లు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఆవునూర్‌లోని పెద్ద చెరువులోకి భారీ వరద నీరు చేరడంతో శిఖంలోనే ఉన్న కేంద్రంలోని ధాన్యం కుప్పలపైకి నీరు వస్తోందన్నారు. తమకు ఓపిక నశించి ఆందోళన చేస్తున్నామన్నారు. డీఎస్వో జితేందర్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడి రైతులను శాంతింపచేశారు. మిల్లర్లు బస్తాకు 42 కిలోల ధాన్యం తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రాలు తీసుకుంటున్న విద్యార్థినులు

వేములవాడఅర్బన్: కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టు పోటీలను హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వేములవాడ మండలంలోని అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన వివిధ విభాగాల విద్యార్థులు రూపొందించిన 7 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. కళాశాల రాష్ట్ర వ్యాప్తంగా మూడో స్థానంలో నిలిచింది. ఈ నెల 1, 2, 3వ తేదీల్లో రాష్ట్రస్థాయిలో ప్రాజెక్టుల ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ పరిశోధన అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి, ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు.

మార్కెట్ యార్డులో వసతులలేమిపై బీజేపీ ధర్నా



ముస్తాబాద్(సిరిసిల్ల): పోతుగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో రైతులకు కనీస వసతులు కల్పించడం లేదని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు మంగళవారం రాస్తారోకో చేపట్టారు. ఏఎంసీ ఎదుట బీజేపీ నాయకులు బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ కనమేని చక్రధర్‌రెడ్డి మాట్లాడుతూ.. పోతుగల్ మార్కెట్ యార్డులో టార్పాలిన్లు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. నీళ్లు, బురదలో రైతులు కష్టాలు పడుతున్న ఏఎంసీ కార్యదర్శి నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారన్నారు. మూడు గంటల పాటు బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టడంతో ఇరువైపుల వాహనాలు స్తంభించిపోయాయి. పీఏసీఎస్ మేనేజర్ రాజేశ్వర్‌రావు వారితో మాట్లాడారు. వసతులు కల్పించేలా తమ పీఏసీఎస్ ద్వారా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బీజేపీ మండల అధ్యక్షుడు కస్తూరి కార్తీక్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, మీస శంకర్, కోల కృష్ణ, వరి వెంకటేశ్, మహేందర్, శ్రీనివాస్‌రావు, బండి శ్రీకాంత్, జనార్ధన్, కిట్టు పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరికి ఏడాది జైలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామంలో 2016లో జరిగిన దాడి కేసులో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ మంగళవారం జూనియర్ సివిల్ జడ్జి రాణి తీర్పు చెప్పారు. ఎస్సై రాజేశ్ వివరాల ప్రకారం.. 2016లో పెద్దకల్వలకు చెందిన చెలకల మల్లేశంపై అదే గ్రామానికి చెందిన చెలకల వీరయ్య, చెలకల దుర్గయ్య దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ రాజ్‌కుమార్ కేసు నమోదు చేశారు. బాధితుడి తరఫున ఏపీపీ రాకేశ్ వాదించి సాక్ష్యాధారాలు సమర్పించడంతో వీరయ్య, దుర్గయ్యకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

నలుగురు రాలే.. విధుల్లో ఒక్కరే

- తంగళ్లపల్లి ఎంపీడీవో ఆఫీస్‌లో ఖాళీగా కుర్చీలు
- సెలవులు, డిప్యుటేషన్‌పై వెళ్లిన ఉద్యోగులు



ఉద్యోగులు రాకపోవడంతో ఖాళీగా కుర్చీలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఉద్యోగులు లేక వెలవెలబోయింది. ఎంపీడీవోతోపాటు ఐదుగురు ఉద్యోగులు డ్యూటీ చేయాల్సి ఉండగా మంగళవారం ఒకే ఒక్క ఉద్యోగి వచ్చారు. మధ్యాహ్నం 2 గంటలకు కూడా కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చిన దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది. ఈ విషయమై సూపరింటెండెంట్ విజయేందర్ రెడ్డిని వివరణ కోరగా.. కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ దీర్ఘకాలిక సెలవుపై, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లు డిప్యుటేషన్‌పై, ఎంపీడీవో శిక్షణ నిమిత్తం హైదరాబాద్ వెళ్లినట్లు తెలిపారు. దీంతో వివిధ పనుల నిమిత్తం ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఖాళీ కుర్చీలను చూసి, వెనుదిరగడం కనిపించింది.

కారు, ఆటో ఢీకొని ఒకరి మృతి



ప్రమాద స్థలంలో నుజ్జునుజ్జయిన ఆటో

- మరో 8 మందికి తీవ్రగాయాలు
- పెండ్లి వేడుకలకు వస్తూ ప్రమాదానికి గురైన కుటుంబం



గాయపడిన రక్షిత, సాత్విక్ (అక్కాతమ్ముడు)



అశోక్, రజితలను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

కమాన్‌పూర్(మంథని): మండలంలోని గుండారం గ్రామం వద్ద పెద్దపల్లి– మంథని ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా 8మందికి గాయాలైనాయి. పోలీసుల వివరాలు.. సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన తంతనపల్లి అశోక్(40) సొంత ఆటోలో అతడి భార్య రజిత, పిల్లలు రక్షిత, సాత్విక్‌తో కలిసి కమాన్‌పూర్ మండలం జూలపల్లి గ్రామంలో జరిగే వివాహ వేడుకలకు వస్తున్నారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన బంధువులు సుజాత, రాహుల్‌ను ఆటోలో వారి వెంట తీసుకువస్తున్నారు. కమాన్‌పూర్ మండలం గుండారం రాజేంద్రనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు రాగానే మంథని నుంచి వస్తున్న కారు, ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఆటో రోడ్డుపై బోల్తా పడగా, కారు రోడ్డు పక్కన చెట్లలోకి దూసుకెళ్లింది. ఆటో నడపుతున్న అశోక్, అందులో ఉన్న రజిత, రక్షిత, సాత్విక్, సుజాత, రాహుల్‌కు తీవ్రగాయాలు కాగా, కారులో ఉన్న ఉదయ్, ఆగయ్య, రాధకు స్వల్ప గాయాలైనాయి. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై షేక్‌మస్తాన్ క్షతగాత్రులను ఆటోలో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రగాయాలైన అశోక్, రజిత, రక్షిత, సాత్విక్, సుజాత, రాహుల్‌ను కరీంగనర్‌లోని ఓ ప్రవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అశోక్ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు.

వేసవి దుక్కులు సిద్ధం



వేములవాడరూరల్: చాలా మంది రైతుల పత్తి, వరి పంటలు చేలల్లోనే ఉన్నాయి. ఈ సమయంలో వరి కోతలు పూర్తయినవారు మాత్రం వరుసగా వర్షాలు కురుస్తుండటంతో వేసవి దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. వేములవాడ మండలంలో కొంతమంది అన్నదాతలు విత్తనాలు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.